
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 11 సెప్టెంబర్ 2024
5
అన్నమయ్య



సేవారత్న అవార్డుకు 'హెల్పింగ్ మైండ్స్' ఎంపిక


సిద్దిక్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లి పట్టణం ముఖ్య కేంద్రంగా ఫుడ్ బ్యాంక్, సానిటరీ ప్యాడ్ బ్యాంక్, ఉచిత బాడీ ఫ్రీజర్ బాక్స్, క్యాన్సర్ భాధితులకు ఉచితంగా విగ్గులు, ఉచిత రక్తపరీక్షలు, రక్తదాన శిబిరాలు, అనాథ మృత దేహాల అంత్యక్రియలు, కరోనా విపత్కర పరిస్థితుల్లో నిస్వార్ధపు సేవలు, కరోనా మృతదేహాల అంత్యక్రియలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్న సేవకులుగా 'హెల్పింగ్ మైండ్స్' విశిష్ట గౌరవ జాతీయ భారత సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ బెంగుళూరులోని సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో తనకు అవార్డు ప్రదానం చేయనున్నారని చెప్పారు. సామాజిక సేవలో విశేష కృషి చేసిన స్వచ్ఛంద సేవకులకు, సమాజానికి సేవ చేసిన వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేయనున్నారని తెలిపారు. తన సేవలను గుర్తించి భారత సేవా రత్న అవార్డుకు ఎన్నిక చేసిన సోమలరాజు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రుణ రికవరీ!

100 శాతం వసూలు దిశగా డిసిసిబి
ఆర్నెళ్ల వ్యవధిలో 75 శాతం పూర్తి
ఎనిమిది బృందాలతో కసరత్తు

డిసిసిబి సంస్థాగత సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రుణాల రికవరీ అంశానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన సుమారు రూ.3,157 కోట్ల రుణాలను రికవరీ చేయడం ద్వారా ఆర్థిక ఆరోగ్యానికి గట్టి పునాది వేయడంపై దృష్టి సారించింది. లాంగ్ టర్మ్, షార్ట్‌టర్మ్ రుణాలు, లిటిగేషన్ రుణాలుగా విభజించింది. 2024-25 సంవత్సరంలో డిసిసిబి జిల్లా యంత్రాంగం తలపెట్టిన లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఇంటర్నల్ చెక్ అండ్ కంట్రోల్‌పై దృష్టి సారించింది. ఇటువంటి ప్రయోగం ద్వారా సాధించే లక్ష్యాలు బట్టి ఆర్థిక జవసత్వాలు ఆధారపడి ఉంటాయని సంస్థ భావిస్తోంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి
ఉమ్మడి కడప జిల్లాలోని 71 ప్రాథమిక సహకార సంఘాలున్నాయి. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన రూ.3,157 కోట్ల రుణాలను రికవరీ చేయడంపై డిసిసిబి దృష్టి సారించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోని తొలి రెండు త్రైమాసికాల సంబంధించి ఆశించిన మేరకు రికవరీ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఏడాది చివరి నాటికి 100 శాతం రికవరీ చేయాలనే లక్ష్యాన్ని అందుకునే దిశగా వడుగులు తీస్తోంది. గతేడాది డిపాజిట్లు, ఈ ఏడాది రుణ రికవరీ అంశాలతో సంస్థ ఆర్థిక ఆరోగ్యాన్ని సంతరించుకునే దిశగా సాగుతోందనే వాదన వినిపిస్తోంది. గతేడాది డిసిసిబి సరికొత్త ఆలోచనలతో డిపాజిట్లకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. విద్యార్థులను సైతం పొదుపు దిశగా ప్రేరేపించి భాగస్వాముల్ని చేసింది.

బృందాల వారీగా లక్ష్యాలు
డిసిసిబి రుణ రికవరీ దిశగా వడివడిగా ముందుకు సాగుతోంది. ప్రధానంగా డిసిసిబి అధికార యంత్రాంగం పరిధిలో ఎనిమిది మంది నోడల్ ఆఫీసర్ల పర్యవేక్షణకు నియమించింది. ఒక్కో బృందానికి పది మంది చొప్పున డిసిసిబి ఉద్యోగుల్ని నియమించింది. వీరికి జిల్లా నోడల్ ఆఫీసర్లను బాధ్యుల్ని చేసింది. రోజువారీ లక్ష్యాల్ని సైతం నిర్దేశించింది. ఉమ్మడి కడప జిల్లాలోని 24 బ్రాంచీలు రికవరీ ఆపరేషన్ ప్రయోగాన్ని చేపట్టాయి. ఒక్కో బృందంలో ఇద్దరు డిసిఎం ఆఫీసర్లు, ముగ్గురు ఎఐఎంలు, ముగ్గురు మేనేజర్లు, నలుగురు నుంచి ఐదుగురు బ్రాంచ్ మేనేజర్లు, ఆయా ప్రాథమిక సహకార సంఘాలకు చెందిన అధికారులు ఉండనున్నారు. రికవరీ బృందాలు రుణ గ్రహీతలను సంప్రదించడం, రికవరీ చెల్లింపులకు ప్రోత్సహించడం, పట్టించుకోని గ్రహీతలకు నోటీసులు జారీ చేయడం, న్యాయపరమైన చర్యలకు దిగడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టడం ద్వారా రికవరీలను వేగవంతం చేసే ప్రయత్నం చేస్తోంది.

ఆర్నెల్లు...75 శాతం రికవరీ!
2024-25 ఆర్థిక సంవత్సరంలోని తొలి రెండు త్రైమాసికాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. డిసిసిబి జిల్లా అధికార యంత్రాంగం నిర్దేశిత రూ.3,157 కోట్ల రికవరీ లక్ష్యంలో రూ.2,700 కోట్ల మేరకు రికవరీ సాధించింది. 75 శాతం లక్ష్యాన్ని సాధించింది. మిగిలిన 25 శాతం లక్ష్యాన్ని ఈ ఏడాది చివరి నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతుండడం గమనార్హం.

రికవరీకి అధిక ప్రాధాన్యత
డిసిసిబి పరిధిలో పేరుకుపోయిన రుణాల రికవరీపై దృష్టి సారించాం. ఆర్నెల్ల వ్యవధిలో ఆశించిన మేరకు పురోగతి సాధించాం. ఈ ఏడాది చివరి నాటికి వంద శాతం లక్ష్యాన్ని అందుకోగలమనే ఆశాభావంతో ఉన్నాం.
- పి.రాజామణి, డిసిసిబి, సిఇఒ, కడప.

విశాఖ 'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలి

- వామపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్
విశాఖ ఉక్కును ప్రయివేటీకరించడం ఆపేలా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పోరాడి బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ ఆపాలని, పూర్తి సామర్థ్యంతో పరిశ్రమ నడవాలని, విశాఖ ఉక్కుపై ప్రభుత్వం మౌనం వీడాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు పిలుపుమేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో రాస్తారోకోలు నిర్వహించారు. బంగ్లా సెంటర్ వద్ద నిర్వహించిన రాస్తారోకో సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసుల, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, సిపిఐఎంఎల్ విశ్వనాథ్, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజులు, రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు రంగారెడ్డి, బసిరెడ్డి మాట్లాడారు. రూ. 9 వేల కోట్ల పెట్టుబడికి రూ. 58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రయివేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశరని, 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుండి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాలలోకి విశాఖ ఉక్కును నెట్టాలని బిజెపి మోడీ ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిచేసి విశాఖఉక్కు ప్రయివేటికరణ ఉపసంహరణ ప్రకటనను కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేయించాలని డిమాండ్ చేశారు. సొంత ఘనులు విశాఖ ఉక్కుకు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో, 64 ఎంపీల రాజీనామాలతో, 32 వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగాలేరని, అవసరమైతే మరో అంతిమ పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి రమణ, కె.సుబ్రహ్మణ్యం రాజు, మాధవయ్య, చెన్నయ్య, అశోక్, హర్ష, జె.సుధాకర్, ఎపి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, నర్సింహులు, వేణు గోపాల్‌రెడ్డి, మురళి, వెంకటరమణ ఆకార్స్ యూనియన్ నాయకులు చంద్ర, సిపిఐఎంఎల్ నాయకులు పూసపాటి రమణ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** స్థానిక బైపాస్ ఎన్టీఆర్ సర్కిల్లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, రాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఉక్కు పరిశ్రమ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని తెలిపారు. టిడిపి ఎన్‌డిఎలో భాగస్వామ్యంగా ఉండి కూడా విశాఖ ఉక్కు పరిశ్రమను ఎందుకు కాపాడలేక పోతుందో చెప్పాలన్నారు. టిడిపి నాయకత్వం కేంద్ర బిజెపిపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీలును కాపాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సిఐటియు నాయకులు ప్రసాద్, రమణ, మల్లి, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, నాయకులు నాగేశ్వరరావు, రమణ, సురేష్, పరమయగారి సుబ్రహ్మణ్యం, నరసింహ, రాఘవేంద్ర, రవి, లోకేష్, ఆంజనేయులు, లింగన్న, రంగన్న, బలరాం, కృష్ణ, విఠోబా పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని టోల్గేట్ సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు, సిహెచ్ చంద్రశేఖర్, సిఐటియు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు టి.రాధాకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగాలేరని తెలిపారు. అవసరమైతే మరో పోరాటానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కును ప్రారంభించి వెనుకబడిన రాయలసీమ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, కడప ఉక్కు రాయలసీమ హక్కు అని నినాదించారు. హైవే పైన రాస్తారోకోతో అర్ధగంట వానలు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సిఐ హేమసుందర్ నాయుడు నాయకులను అరెస్టు చేసి తర్వాత విడుదల చేశారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం మండల నాయకులు, బొజ్జ శివయ్య, ఎపిఎండిసి జెఎసి పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్, సిఐటియు ఉపాధ్యక్షులు మోడీ సుబ్బరామయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కేశవులు, ఎపిఎంసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి పి.మురళి, సిపిఐ నాయకులు దార్ల రాజశేఖర్, సిఐటియు నాయకులు హరి, పుల్లగంటి రమణయ్య, కె.హరికృష్ణ, శివ ప్రసాద్, హరినాథ్, శంకర్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక జ్యోతి చౌక్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. విశాఖ ఉక్కును ప్రయిటీకరణ చేయవద్దంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, నాయకులు ఎస్.బషీర్ ఖాన్, జి.రఘునాథ్, ఎం.అష్రఫ్ అలీ, ఎస్.తంబయ్య శెట్టి, ఎస్.జవహర్ బాబు, గంగులప్ప, నరసింహులు, దుమ్ము బాబు, గంగాధర్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద ఎఐటియుసి, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తోపు కృష్ణప్ప, నాయకులు మురళి, తిరుమల, ముబారక్, దేవా, రెడ్డప్ప, చంద్రశేఖర్, మెకానిక్‌రెడ్డి పాల్గొన్నారు.


రాయచోటి : బంగ్లా వద్ద రాస్తారోకో చేస్తున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు


రాజంపేట : రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాలు


రైల్వేకోడూరు : టోల్‌గేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి : కలెక్టర్



పిహెచ్‌సిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-పెద్దమండ్యం
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దమండ్యంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యులు సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించారు. మందుల స్టాక్ పరిశీలించి ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోజువారి ఒపి కేసులు ఎన్ని వస్తాయి, ఏఏ చికిత్సలకు వైద్య సేవలు అందిస్తున్నారు, డెంగీ, మలేరియా జ్వరాలు కేసులు ఎన్ని ఉన్నాయి, వాటి నివారణకు తీసుకున్న చర్యలు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు, రక్తహీనత కేసులు తదితరాలలో వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌సిహెచ్ రిజిస్టర్, అటెండెన్స్, మందుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒపిడి, ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలలో భాగంగా ఒపిడి సేవలు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ సేవలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. రక్తహీనత కలిగిన మహిళలు, పిల్లలకు ఐరన్ మాత్రలను తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి అందుబాటులో లేని మందులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో పుల్ల సూచనలు సలహాలను జారీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.
రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపాలి : మండలంలోని గుడిసివారిపల్లి చెరువు మలుపులో రోడ్డు విస్తరణకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఇరిగేషన్, ఉపాధి హామీ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. గుడిసివారిపల్లి చెరువును కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువుపైనున్న మలుపు రహదారిని కొద్దిగా విస్తరించాలని అక్కడి గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి మలుపు వద్దనున్న రోడ్డు విస్తరణకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు.

విద్యా ప్రమాణాలను పెంపొందించాలి

- విద్యాశాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి - కడప అర్బన్
విద్యా ప్రమాణాలను విద్యాశాఖ కార్యక్రమాలను రాష్ట్రస్థాయిలో ముందుండేలా నడిపించాలని జిల్లా విద్యాశాఖ నోడల్ అధికారి మధుసూదన్ రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ అధికారులతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారమంతా యుడిఐఎస్ఇ పనిచేసేందుకుఅధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల వయసు గల ప్రతి విద్యార్థి పాఠశాలల్లో ఉండేందుకు విద్యా శాఖలోని వివిధ రకాల అనుసంధాన సంస్థలతోపాటు కలసి పనిచేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అన్ని యాజమాన్యాలకు ముఖ్యంగా ప్రభుత్వంతో పాటు ప్రయివేటు ఇతర యాజమాన్యాలకు విద్యార్థులందరికీ విద్యకు సంబంధించిన వసతులు కల్పించడంలో, నాణ్యమైన విద్యార్థులు అందించడంలో విద్య హక్కు చట్టం ప్రకారం చేరాల్సిన వసతులను సమకూర్చే విధంగా చూడాలని ఆదేశించారు. ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని కార్యాలయ సిబ్బందితో విద్యాసంబంధమైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అందుకు సంబంధించిన రిపోర్ట్సను వెనువెంటనే జిల్లా కార్యాలయానికి పంపించి రాష్ట్రంలో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలు మొదటి స్థానంలో పోటీపడాలని తెలిపారు. ఆర్‌టిఇ కారం ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులకు తప్పనిసరిగా అడ్మిషన్ ఇవ్వాలని, లేని పక్షంలో పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వ ఆధీనంలో మాత్రమే పనిచేస్తాయని, అవి స్వతంత్ర యాజమాన్యాలు కాదని ఈ విషయాన్ని అన్ని ప్రయివేటు యాజమాన్యాలు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. బాలికా విద్యను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కస్తూరి బాలిక విద్యాలయాలను ఏర్పాటు చేయడంతో బాలిక విద్యా అక్షరాస్యత గణనీయంగా పెరిగిందని చెప్పారు. అక్కడ విద్యాభ్యాసం అందించిన అనేక మంది బాలికలు ఉన్నత స్థానాల్లో చేరుకుంటున్నారని గుర్తు చేశారు. అనంతరం వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, అన్నమయ్య జిల్లా అధికారి ప్రకాశ్ రెడ్డి వారి జిల్లాలలో విద్యాపరమైన ప్రగతిని తెలియజేశారు. కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి, ఉప విద్యాశాఖ అధికారులు రాజగోపాల్ రెడ్డి, కృష్టపర్, పురుషోత్తం, వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఏడి మునీర్ ఖాన్, అన్నమయ్య జిల్లా ఏడి ప్రసాద్ రావు, బుక్స్ గోడౌన్ మేనేజర్ రామానుజ దేవి, మండల విద్యాశాఖ అధికారులు 1,2 సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు

పరిశోధనల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి
మిట్స్ కళాశాలలో పరిశోధన అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కలశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనలలో రాణిస్తున్నారని, ప్రతిభ కనపరిచిన వారికి నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాతి పొందిన వెబ్ ఆఫ్ సైన్స్, స్కోపస్, ఎస్‌సిఐ, ఐఇఇఇ మొదలైన వాటిలో అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. విద్యార్థులు, అధ్యాపకులను మరింత ప్రోత్సాహం కొరకై ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రూ.9.60 లక్షలను ప్రోత్సాహకాలుగా తమ కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ప్రోత్సాహకాలు అందించిన కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్లకు కళాశాల ప్రిన్సిపల్ కృతతలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ అడ్వైసర్ డాక్టర్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, అడ్వైసర్ డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ డాక్టర్ శివయ్య పాల్గొన్నారు.


పరిశోధకులతో ప్రిన్సిపల్ యువరాజ్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- పాఠశాలల తనిఖీలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-పెద్దమండ్యం/చిన్నమండెం
ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేస్తోందని, పిల్లలకు నాణ్యమైన బోధనను అందించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం-1ను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు ఎంతమంది, పిల్లల సంఖ్య ఎంత అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం పిల్లలతో ముచ్చటించి విద్యలో వారి నైపుణ్యాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలు ఎంతమంది, నమోదైన గర్భిణులు, బాలింతలు ఎంతమంది, రక్తహీనత కలిగిన పిల్లలు, మహిళలు ఎంతమంది, అందరికీ పోషకాహారం సక్రమంగా అందిస్తున్నారా, అంగన్వాడీ కేంద్రానికి వస్తున్న కోడిగుడ్లు, వస్తువుల సరఫరా, వాటి నాణ్యత తదితర అంశాలపై అంగన్వాడీ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుని అందుకు సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలతో ముచ్చటించి, వారికి ఉన్న లర్నింగ్ స్కిల్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్వహణను బాగా చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఐసిడిఎస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అంగన్వాడీ సెంటర్‌లో టీచింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షహీద్ అహ్మద్, ఎంపిడిఒ శ్రీధర్, సిడిపిఒ నాగవేణి, సూపర్వైజర్లు కళావతి, నాజియా బేగం, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
జడ్‌పి హైస్కూల్లో తనిఖీ : చిన్నమండెం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో రోజువారి అమలు చేస్తున్న మెనూ వివరాలను, లెసన్ ప్రణాళికలు, టాయిలెట్స్ నిర్వహణలపై ప్రధానోపాధ్యాయులు రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. చదువుపై వారికి గల ఆసక్తి, పాఠశాలలో విద్యాబోధన తదితర అంశాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న మెనూ నాణ్యతగా ఉందా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాలకు ప్రహరీ లేదని, తాగునీటి సమస్య ఉందని కలెక్టర్‌కు విద్యార్థులు విన్నవించారు. ఉపాధి హామీ కింద ప్రహరీ కోసం ప్రతిపాదనలు ఇచ్చామని, మంజూరు కాలేదని కలెక్టరుకు హెచ్‌ఎం వివరించారు. ప్రహరీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, ప్రత్యేక నిధులతో తాగునీటి కొరకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విద్యార్థినులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.


పెద్దమండ్యం : విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతికి పాటుపడాలి

ప్రజాశక్తి-మదనపల్లి
ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం కళాశాలలో గ్రామ జ్యోతి స్వచ్ఛంద సంస్థ, కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి స్థాపనకై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలలోని యువత ముందుకు వచ్చి పర్యావరణాన్ని కాపాడి ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ప్రతి యువతీ యువకుడు అన్వాయుధాలను తెజించి శాంతి దూతకై ప్రపంచానికి చాటాలని తెలిపారు. గ్రామ జ్యోతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బి.సుభద్ర మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశానికి ప్రత్యేకత ఉంది ప్రపంచానికి ఏమైనా దేశం ఒక చుక్కను వంటిది ప్రపంచ శాంతి స్థాపన మన దేశం నుండే మొదలవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజుకు ఒక మొక్కను నాటాలన్నారు. కళాశాల అధ్యాపకులు టి.సాయి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రకృతి విలయానికి కారణం మనమందరం ప్రకృతి పట్ల నిరాదరణ చూపడమేనన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శేగు రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ యువతి దేశానికి భవిత, యువశక్తి అను శక్తి కంటే శక్తివంతమైనదన్నారు. యువతి అనుకుంటే సాధించలేనిది ఈ ప్రపంచంలో ఏదీ లేదని, ప్రతి ఒక యువతీ యువకులు ముందుకు వచ్చి ప్రపంచ శాంతి స్థాపనకై కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, మాలతి, రమణ, శ్రీనివాసులు, చంద్రమోహన్, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- కలెక్టర్‌కు టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-సుండుపల్లి: మండలంలోని మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని మండల టిడిపి నాయకులు కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ నుంచో వచ్చి టిప్పర్లతో కుంటలు, చెరువులో అక్రమంగా మట్టిని రాత్రి వేళల్లో తరలిస్తున్నారని అన్నారు. చెరువుల్లో బోర్లు, పైప్ లైన్లు ఉన్నాయని అక్కడ మట్టి తీసేయడం వల్ల రైతులకు చాలా ఇబ్బందులు కలుగుతుందని అన్నారు. ఈ విషయం పైన స్పందించి మట్టి అక్రమ రవాణా జరగకుండా చూడాలని కోరారు. మండలంలోని పేద ప్రజలు ఎక్కువ ధరలు పెట్టి టిప్పర్లతో మట్టిని తోలుకుండే స్థితిలో లేరని, వెంటనే అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని తహ శీల్దార్ కార్యాలయం చాలా ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతుందని, ప్రభుత్వ స్థలంలోనే శాశ్వత తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రెడ్డప్ప, మాజీ అధ్య క్షులు శివకుమార్‌నాయుడు, ఎస్‌సి, ఎస్‌టి సెల్ మండలఅధ్యక్షులు చంద్రమౌళి, జనసేన పార్టీ నాయకురాలు నంద్యాల రెడ్డిరాణి, శివరామనాయుడు, మాజీ ఎంపి టిసి బాబు, ప్రసాద్‌రాజు, రమణ పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని నీలకంఠరావుపేట జడ్‌పిహైస్కూల్లో ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ ,మండల కో-ఆర్డినేటర్ ఎస్.నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 12న అండర్-14, అండర్-17 బాల బాలికలు పోటీలు ఉదయం 9.30లకు యోగ, షటిల్, చెస్, అథెలిటిక్స్, 13న తేదీన కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహిస్తారని చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. క్రీడలను మండల విద్యాశాఖ అధికారులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతినివ్వండి

ప్రజాశక్తి-సుండుపల్లి


తహశీల్దార్ కార్యాలయంలో ఎస్‌ఎకు వినతి పత్రం ఇస్తున్న ఈశ్వర్

మండలంలోని ఇసుక రవాణాకు అనుమతిన్వివాలని కోరుతూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ మంగళ వారం తహశీల్దార్ కార్యాల యంలో ఎస్ఎకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామపంచాయతీలో ప్రభుత్వం మంజూరు చేసి పక్కా గృహాలకు ఇసుక, మట్టి అవసరం ఉందని అన్నారు. పేద ప్రజల ఇంటి నిర్మాణాలకు మట్టి, ఇసుకకు అనుమతులు త్వరగా ఇచ్చేలా అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. రాజంపేటలో సచివాలయంలో ఇసుక కోసం వచ్చిన రైతులు ఒకరినొకరిని తోపులాడుకొనే పరిస్థితి ఏర్పడిందని అలా కాకుండా చూడాలని అన్నారు. గతంలో సచివాలయం ద్వారా సచివాలయంలోని అసిస్టెంట్ ఇంజినీర్ ద్వారా అనుమతి వస్తే మండలంలో ఇసుకను విక్రయించే అవకాశం ఉండేదని అన్నారు. ఇసుక, మట్టి కొరతతో పేదలు సొంతింటి కలను నెరవేర్చుకోలేక పోతు న్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేద ప్రజల ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకొని అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

రైతులకు నాణ్యమైన టార్పాలిన్ పట్టలు

ప్రజాశక్తి-వీరబల్లి

రైతులకు నాణ్యమైన ఉలవలు, టార్పాలిన్ పట్టలు తక్కువ ధరలో అందిస్తామని ఎపియం ఖాదర్‌వలి తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య కార్యవర్గ సమావేశం కార్యదర్శి రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎపియం మాట్లాడుతూ సీజనల్ పంటలకు రైతులకు అవసరమయ్యే విత్తనాలు, వ్యవసాయ పరికరాలు కావలసిన వారు మీ పరిధిలో పనిచేసే రైతుమిత్రలకు తెలిపాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో కలిగి ఉండే సంస్థతో ఒప్పందం ఉంద న్నారు. రైతులకు కావలసిన పిచికారీ యంత్రాలు, డ్రైలకు కావసిన పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సమాఖ్య కోశాధికారి రాంప్రసాద్, సిసి వెంకటలక్ష్మి, అకౌంటెంట్ మరియమ్మ, బిఓడి సభ్యులు పాల్గొన్నారు.

వేమన పద్యాల పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వేమన పద్యాల పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, రమణమ్మలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడపకు చెందిన రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో పంపిణీ చేసిన ఈ పుస్తకల్లోని పద్యాలను విద్యార్థులు ధారణ చేయడం కోసం తెలుగు ఉపాధ్యాయులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంజేటి నాగేంద్రప్రసాద్, శిల్పి ఆనందాచారి, రవికిరణ్‌రెడ్డి, విజయ కుమార్, తులసీ స్వర్ణత పాల్గొన్నారు.

బయ్యర్స్, సెల్లర్స్ మీట్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- రాయచోటి

చేనేత సిల్క్ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించడానికి చేనేత జౌళి శాఖ మంగళగిరి వారి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14వ తేదీలలో విజయవాడలోని శేష సాయి కళ్యాణ మండపం, ఎంజీ రోడ్డులో బయ్యర్స్ సెల్లర్స్ మీట్ నిర్వహిస్తున్నారని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి యు.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి చేనేత సిల్క్ సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్, చేనేత కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. వస్త్ర వ్యాపారులు, షాపింగ్ మాల్స్ యజమానులు వీటిని కొనుగోలు చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బయ్యర్స్ సెల్లర్స్ మీట్ ను సందర్శించి మదనపల్లె సిల్క్ సారీస్ ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని తెలిపారు.

జిఒ115ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జిఒ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి వద్ద ఎఎన్ఎంలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుంచి కాంట్రాక్ట్ బేసిక్ పద్ధతిలో ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకుందని అన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తమను క్రమబద్ధీకరణ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ జీతంతో పని చేస్తున్న తమను మోసం చేస్తూ ప్రభుత్వం మూడు రోజుల క్రితం జిఒ నెంబర్ 115 ను తీసుకొచ్చిందన్నారు. ఆ జిఒ ప్రకారం కొత్తగా ఎఎన్ఎంలను ఉద్యోగాల్లోకి తీసుకుని, వారికి 18 నెలలు శిక్షణ ఇచ్చి తమ పోస్టుల్లో వారిని భర్తీ చేసి తమను తీసి వేయాలని చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తీరు మార్చుకొని వెంటనే జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు చేయనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పొలంబడితో అధిక దిగుబడి : జెడి

ప్రజాశక్తి-రామాపురం

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోమగుడిపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పొలం బడి ఆవశ్యకతను తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడకం ద్వారా అధిక పెట్టుబడి తగ్గించి ఎక్కువ దిగుబడి సాధించవచ్చుని, వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చని అన్నారు. వేరుశనగ పంట చుట్టూ నాలుగు వరుసలలో జొన్న పంటను రక్షక పంటగా వేసుకోవడం ద్వారా తామర పురుగులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఆముదం పంటను ఎర పంటగా వేసుకోవడం ద్వారా పొగాకు లద్దె పురుగును నివారించుకోవచ్చు తెలిపారు. వేరుశనగ పొలంలో రసం పీల్చు పురుగుల నివారణకు వేప నూనె పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. చాలా కాలం నుంచి బీడుగా ఉన్న భూములను సాగులోకి తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ నాగమణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న జెడి చంద్రనాయక్

ఓపిక, సహనంతోనే ఆత్మహత్యలను నివారించవచ్చు


ఆత్మహత్యలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-కలికిరి

సహనం, ఓపిక తోనే ఆత్మహత్యలను నివారించవచ్చునని వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మానసిక వైద్యులు, జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉదయ్ కిరణ్‌లు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆత్మహత్యలు ఎక్కువగా 15 సంవత్సరాల నుంచి 29 చేసుకుంటున్నట్లు సర్వేలు చెబుతు న్నాయని అన్నారు. సహనం, అవగాహన, భరోసాతో ఆత్మహత్య లను నివారించవచ్చునని అన్నారు. మానసిక వైద్యులు ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ 2022లో మన దేశంలో లక్షా 70వేల మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని జాతీయ నేర చట్టాల సంస్థ చెప్తోందన్నారు. ఇంకా నమోదుకాని ఆత్మహత్యలు ఇంకెన్నో ఉన్నాయని అన్నారు. 2018తో పోలిస్తే ఈ సంఖ్య 27శాతం ఎక్కువుగా ఉందని అన్నారు. మనదేశంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి కానీ తగ్గడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది యువతే ఆత్మహత్య పాల్పడుతున్నారని అన్నారు. ఆత్మహత్యలకు పాల్పడే వారు పిరికివారు, బలహీనులు కాదని అన్నారు. మెదడులో మార్పులు, మానసిక ఒత్తిడులు, ఆసరా లేకపోవటం తదితర ఏ ఒక్క కారణం వలన మాత్రమే ఆత్మహత్యకి పాల్పడరని చాలా విషయాలు ఎప్పటి నుంచో పేరుకుని ఒక విషయంలో అన్నీ కలిసి ఆత్మహత్యకు పురిగొల్పుతాయని అన్నారు. ఆత్మహత్య చేసుకోవాలి అనే ఆలోచన స్థిరం కాదని, ఆత్మహత్య చేసుకోవాలి అనుకునేవాళ్లు చనిపోవాలి అనే బలమైన నిర్ణయంతో కాకుండా ఏం చేయాలో తెలీని అయోమయంలో ఎక్కువ ఉంటారని, వీరికి ఆ క్షణంలో తార్కికంగా ఆలోచించే శక్తి, ఓపిక ఉండకపోవడం, వారికి అప్పుడు ఆసరాగా నిలవటం ద్వారా ఆ ఆలోచనల నుంచి బయట పడవేయవచ్చునని అన్నారు. ఒకసారి ఆత్మహత్యకి ప్రయత్నించినవాళ్లు కచ్చితంగా మళ్లీ ప్రయత్నించి చనిపో తారనేది నిజం కాదని, వారిలో 85-95 శాతం మంది సాధారణ జీవితం గడుపుతున్నారని అన్నారు.నేను ఆత్మహత్య చేసుకోవాలి అనుకుంటున్నాను, నాకు చనిపోవాలని ఉంది. వంటి ఆలోచనలు చెప్పేవాళ్ళ మాటలని తప్పనిసరిగా పట్టించుకోవాలని అన్నారు. ఆ మాటల నిగూడార్థం నాకు సహాయం కావాలి అనే అర్థం ఉందని అటువంటి వారికి వాళ్లకి సాంత్వన చేకూర్చాలని అన్నారు.అనంతరం జిల్లా ఆర్‌బిఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ నాయక్ మాట్లాడుతూ మానసిక వ్యాధులు సమాచారం, సలహాల కొరకు 14416 టోల్ ఫ్రీ నెంబర్ టెలి మానస్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ త్యాగరాజన్, ఎన్ఎస్ఎస్‌కో-ఆర్డినేటర్ డాక్టర్ అపర్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఎస్‌టిఐఎస్.నాగిరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పారా లీగల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రాణించిన శివకోటి

ప్రజాశక్తి-నందలూరు


ట్రోఫీతో శివకోటి

కోయంబత్తూర్‌లో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి ఇండియన్ పారా క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో నందలూరుకు చెందిన ఏలుసూరి శివకోటి పాల్గొని తన ప్రతిభను చాటు కున్నాడు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ ఈ టోర్నమెంటులో 6 జట్లు పాలొన్నాయని అన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గెలాక్సీ జెయంట్స్, థండర్స్ మధ్య జరిగిన ఉత్కంఠ భరితమైన పోరులో మూడు బంతులు మిగిలి ఉండగానే తమ జట్టు విజయం సాధించిందని అన్నారు. ఆడిన నాలుగు మ్యాచ్లోనూ బౌలింగ్‌లో అద్భుతమైన ప్రతిభను కనపరిచానని అన్నారు. కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి ఒక మేడిన్‌తో పాటు 3 కీలకమైన వికెట్లు తీసి కేవలం 9 పరుగులు మాత్రమే ఇచ్చి, జట్టు ఫైనల్‌కు చేర్చడంలో ప్రధాన భూమిక పాత్రను పోషించానని అన్నారు. టోర్న మెంట్ మొత్తంలో 16 ఓవర్లు వేసి 7 వికెట్లు తీసి కేవలం 45 పరు గులు మాత్రమే ఇచ్చానని తెలిపాడు. విజేతగా నిలిచిన తమ జట్టు ఫ్రాంచైజీ గెలాక్సీ జెయంట్స్ యజమాని రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ కోయంబత్తూర్ గెలాక్సీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన మా జట్టుకు విన్నర్స్ ట్రోఫీతో పాటు, మెడల్స్, సర్టిఫికేట్స్ అందించారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని టోర్న మెంట్ లో పాల్గొని నందలూరు పేరు ప్రఖ్యాతలను, కీర్తిప్రతిష్ఠతలను, దేశ నలు మూలలా తెలియజేసే విధంగా ఉన్నత స్థాయికి ఎదు గుతానని అన్నారు. క్రీడాకారులకు మానసిక బలం అవసరమన్నారు.దివ్యాంగ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వసంత కుమార్, మును స్వామిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని పక్క గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ రాచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయని వివరాలు అడిగి తెలుసుకున్నారని అన్నారు. మధ్యలో ఆగిపోయిన ఇంటి నిర్మాణాలను, ఇంత వరకు ప్రారంభంకాని లబ్ధిదారుల జాబి తాను సబ్‌కలెక్టర్‌కు తెలియజేశామని అన్నారు. పక్క గృహాలు నిర్మించుకున్న లబ్ధి దారులు ఎలాంటి ఇబ్బందులు పడ కుండా వారికి రావాల్సిన సామగ్రిని ఎప్పటికప్పుడు అందించాలని ఎఇలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆగి పోయిన ఇంటి నిర్మానాలు తిరిగి ప్రారంభించే విధంగా కృషి చేయాలని తెలిపారు. లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగరాజునాయక్, పిఆర్‌జెఇ ఎంవి.జయరాం నాయక్, ఎఇలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు అధికారులు అవగాహన కలిగించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది తప్పనిసరిగా ప్రతిరోజూ గృహ నిర్మాణ పనులను తనిఖీ చేయాలని అన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందజేసి గృహనిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ఆలస్యం కాకుండా పూర్తి చేసుకోడానికి సహకరించాలని అన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచే యాలన్నారు. మండలంలో మొత్తం 2348 గృహాలు మంజూరు కాగా 1155 గృహాలు పూర్తయ్యాయని, 34 గృహాలు ప్రారంభానికి నోచుకోలేదని వారు తెలిపారు. కార్యక్రమంలో పిటిఎం ఎంపిడిఒ కె.ఎన్ బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి యోగానంద, హౌసింగ్ ఇంజినీర్ శ్రీనివాస్, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్, ఉపాధి హామీ ఎపిఒ తిరుపాలప్ప, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, నాగార్జున, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్ బాషా, శివ ప్రసాద్, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ పనులను తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. పిటిఎం, రంగసముద్రం లేఅవుట్‌లలో గృహ నిర్మాణ పనులను పరిశీలిచారు. రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ శివ ప్రసాద్ రంగ సముద్రం లేఅవుట్లలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో జరిపిన అవగాహన కార్య క్రమంలో పాల్గొన్నారు.


సుండుపల్లి: మాట్లాడుతున్న ఎంపిడిఒ రామచంద్ర

విభిన్న ప్రతిభావంతులకు అండగా 'వెలుగు'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


బాలుడికి చంక కర్ర అందిస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి

విభిన్న ప్రతిభావంతులకు అండగా వెలుగు సంస్థ ఉంటుందని వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెలుగు సంస్థలో శ్రవణ యంత్ర ము, చంక కర్రల, చేతి కర్ర ఉపకరణాలను అందిం చారు. మదనపల్లి మండలం, కొండమర్రిపల్లి, బసినికొండ గోవర్ధన్ కాలనీకి చెందిన దివ్యాంగుడైన కాయల రాజశేఖర్ (33)కి శ్రవణ యంత్రము, గుర్రంకొండకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు చిన్నారి యస్.అనిశా ఫాతిమా(10)కు చంకకర్రలు, బి.కొత్తకోట మండలం, బండారు వారిపల్లి, సీతివారిపల్లిలో నివాసం ఉంటున్న మేకల వెంకట రమణా రెడ్డి అనే వృద్ధుడికి చేతికర్రను వెలుగు ప్రాంగణంలో వెలుగు సెక్రటరీకి అందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి వెలుగు సంస్థ నిర్విరామ కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులకు ఏ అవసరం వచ్చినా వెలుగు సంస్థను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

ఉచిత మోకాలి చికిత్స శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ ఐ హాస్పిటల్‌లో జరుగుతున్న ఉచిత మోకాలి చికిత్స శిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోంది. మంగళవారం ఫౌండేషన్ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగింది. ఈ నెల 12తేదీ వరకు కొనసాగే ఈ శిబిరంలో రాజస్థాన్ డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంతన్ సహకారంతో మోకాలి నొప్పి, వెన్నెముక నొప్పి, సర్వైకల్ నొప్పికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ప్రారంభమైన ఈ శిబిరం గురువారం వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో మోకాలికి ఆపరేషన్, చికిత్స లేకుండా జర్మనీ టెక్నిక్ ద్వారా బ్రేస్ తయారు చేయబడిందన్నారు. ఈ పద్ధతిలో చికిత్సను ఐదు రోజుల పాటు తీసుకొంటే ఉపశమనం ఉంటుందని డాక్టర్ ఇంద్రపాల్ కసూరియా బిఇఎంఎస్, థెరపిస్ట్ భూపేంద్ర చౌదరిలు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఎక్స్-రే, ఎంఆర్ఐ, రోగ నిర్ధారణకు సంబంధించి వివరాలతో సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చునని పేర్కొన్నారు.లయన్స్ ఐ హాస్పిటల్, సొసైటీ కాలనీని సంప్రదించాలని కోరారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేస్, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ముత్తూ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం వన్ బిలియన్ యూత్ ఫర్ పీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రపంచ శాంతి కొరకు ప్రతిజ్ఞ చేయించారు. హింసకు, అణ్వాయుధాలకు వ్యతిరేకంగా పోరాడుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యునైటెడ్ రెలిజియన్స్ ఇనిషి యేటివ్ స్టేట్ ఆర్గనైజర్, పేస్ సంస్థ డైరెక్టర్ వి.యస్.రెడ్డిలు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ప్రపంచ వ్యాప్తంగా హింస ప్రవృత్తి ప్రబలిపోతోందని, ఇది అశాంతికి దారితీస్తోందని, దీని పరిణామాలు ముందు ముందు భయంకరంగా ఉండబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హింసకు అందరూ దూరంగా ఉండాలన్న విషయాన్ని విద్యార్థులకు బోధిస్తున్నామన్నారు. చైతన్య సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎం.పి. ఆనందన్ మాట్లాడుతూ శాంతిస్థాపన కోసం అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ ఎ.కృష్ణ చరణ్, ట్రెజరర్ అండ్ కరెస్పాండెంట్ పట్నం గిరిజమ్మాల్, ముత్తూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ ఎ.కవితరాణి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జి.వి.ఎస్.బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గ్రామజ్యోతి ఆధ్వర్యంలో..** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రపంచ శాంతి నెలకొల్పేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర విద్యార్థులకు తెలిపారు.


లడ్డూను దక్కించుకున్న సూరపురాజు నరసరాజు దంపతులు

రూ.70 వేలు పలికిన అనంతపల్లి లడ్డూ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతపల్లి గ్రామంలో వినాయక చవితి నాలుగవ రోజు నిమజ్జనం పురస్కరించుకొని భారీ స్థాయిలో లడ్డూ వేలం పాట వేశారు. వేలం పాటకు ఆశవహులు ప్రయత్నించగా చివరికి సురపరాజు నరస రాజు భార్య చంగమ్మ దంపతులు రూ.70 వేలకు వినాయక లడ్డూను క్రైసవం చేసుకున్నారు. మండల వ్యాప్తంగా విగ్రహాలు మంగళవారం నిమజ్జనం చేశారు. స్థానిక ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నిమజ్జనం నిర్వహించారు.

20న బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 20న శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చిస్తారని చెప్పారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలని సూచించారు. మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికా రులు తప్పక హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- కలకడ

ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ రెడ్డి, సాంబ తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి సహకారంతో మండలంలోని నడిమిచర్ల పంచాయతీ రైతు సేవ కేంద్రంలో మదనపల్లె పట్టణానికి చెందిన ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన కేంద్రం వారిచే బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరానికి నేత్రాలకు సంబంధించిన చికిత్సలు చేయించుకునేవారు తమ వెంట ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తీసుకొని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

260 కిలోల బియ్యం వితరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు మిండిగళ్ళు లక్షణ్ భార్య శ్రావణి, డాక్టర్ శ్రీకాంత్ కలసి చింతామణి, బెంగుళూరులలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు అన్నదానం కోసం 26 కేజీల పరిమాణం కలిగిన 10 బ్యాగులు మొత్తం 260 కేజీల బియ్యం, 21 కేజీల లడ్డును వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ సభ్యులు సమాజ సేవా కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడదామని అన్నారు. కార్యక్రమంలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదం బాధాకరం :'దాసరిపల్లి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెద్దమండ్యం మండలం, పాపేపల్లి పంచాయతీ, వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువు కట్టపై ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో మరణించిన మౌలా సాహెబ్ కుమారుడు ఆరవ తరగతి విద్యార్థి అఫ్జల్(11) మృతదేహాన్ని తంబళ్లపల్లె టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మంగళవారం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో సందర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, మృతి చెందిన అఫ్జల్ దహన సంస్కారాలకు రూ.10 వేలు అందించారు. ఇదే ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంజయ్‌ని పరామర్శించి అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, సుభాన్, ఆసిఫ్, అల్తాఫ్, సయ్యద్, ఖాజా సాహెబ్, ఆలీషా, జాఫర్ వల్లిలకు అయ్యే వైద్య ఖర్చులు మొత్తం తానే భరిస్తానని బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించి మానవతా దృక్పథంతో తనవంతు సాయం చేసి దాతృత్వాన్ని చాటుకున్న జయచంద్రా రెడ్డిని పలువురు అభినందించారు. జయ చంద్రారెడ్డితో పాటు ప్రమాద బాధితులను పరామర్శించిన వారిలో సీడ్ మల్లికార్జున నాయుడు, తులసీధర్ నాయుడు, నాగేష్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎర్రగుడి సురేష్, కె.వి.రమణ, త్యాగరాజు, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శంకర రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రవి, శ్రీనివాసులు, ఎర్రం రెడ్డి పవన్ కుమార్ రెడ్డి రెడ్డెప్ప, ఫజ్లు, దయ్యాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిర్దేశించిన చెరువుల్లోనే నిమజ్జనాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిర్దేశించిన చెరువుల్లోనే వినాయక నిమజ్జనాలు చేయాలని మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మంగళవారం మదనపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సూచించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచనల మేరకు బసినికొండ వద్ద ఉన్న స్వామి చెరువు, బైపాస్ రోడ్డు దగ్గర ఉన్న నేరెళ్ల చెరువు, నిమ్మనపల్లి రోడ్డు, రామాచార్లపల్లి వద్ద ఉన్న లింకి శెట్టి చెరువు, తట్టివారిపల్లి చెరువు లను గుర్తించినట్లు తెలిపారు. కావున భక్తాదులు నిర్దేశించిన చెరువుల్లోనే వినాయక నిమజ్జనాలు చేయాలని తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ప్రజాశక్తి-పీలేరు

పట్టణ ప్రజలకు తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపిటిసి, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో నీటి సరఫరా, పారిశుధ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల తాగు నీటి అవసరాలు చేర్చడంతో పాటు పారిశుధ్య సౌకర్యాలు చూడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసి నరసింహా రెడ్డి, వార్డు సభ్యులు విక్టరీ వెంకట్రమణా రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, సాంబశివ రెడ్డి, కాలేషా పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలను సహించం : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి నేతల అరాచకాలను సహించబోమని టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పులపుత్తూరు గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఇంటి ముందు డిజె పెట్టి బాణాసంచా పేల్చారన్న నెపంతో కొందరు వైసిపి నేతలు తెలుగుదేశం కార్యకర్తలైన కుంభగిరి వెంకటసుబ్బయ్య, కుంభగిరి మల్లయ్య, ఒంటిమిట్ట పెంచలమ్మ, సుద్దుల వెంకటమ్మలపై దాడి చేయడంతో గాయాలపాలైన వారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బాలసుబ్రమణ్యం మంగళవారం ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులైన టిడిపి కార్యకర్తలపై కులం పేరుతో దూషించి దౌర్జన్యానికి పాల్పడిన వైసిపి నేతలను విస్మరించేది లేదని హెచ్చరించారు. కక్షపూరితంగా దాడులకు పాల్పడిన వైసిపి నేతలపై పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, మరల ఇలాంటి ఘటనలు మండలంలో ఎక్కడా పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. బాధితులకు అన్ని విధాల అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, గీతాంజలి రమణ, టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ తుపాకుల అశోక్, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ళ చంద్రమౌళి, కె.ఎస్.నరసింహా, వెంకటేష్, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు